టీచర్ల తప్పు లేదు

విద్యాశాఖ అధికారులు

కాచిగూడ: పూత వ్యాధి ఉందంటూ విద్యార్థిని టీచర్లు వెలివేసిన సంఘటనపై హిమాయత్‌నగర్ జోన్ విద్యాశాఖ అధికారులు శుక్రవారం కాచిగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విచారణ చేపట్టారు. హిమాయత్‌నగర్ డీఈఓ అస్రా ఫాతిమా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఆర్. సుమన్‌లు పాఠశాలకు వచ్చి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న బాధిత విద్యార్థి నాక్షిత్‌తో పాటు తోటి విద్యార్థులతో అధికారులు మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అధికారులు నాక్షిత్‌ను ముట్టుకోవద్దని.. మాట్లాడవద్దని టీచర్లు మీతో చెప్పారా.? అని విద్యార్థులను అడిగారు. అయితే టీచర్లు అలా చెప్పలేదని విద్యార్థులు తెలిపారు. దీంతో ఉపాధ్యాయుల తప్పులేదని తేలిందని అధికారులు తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన

అంబర్‌పేట: సీపీఆర్‌పై ప్రక్రియపై 108 అంబులెన్స్ సిబ్బంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం సీపీఎల్ రోడ్ లకోటియా ప్రభుత్వ పాఠశాలలో గుండె పోటు వచ్చినప్పుడు స్పందించాల్సిన తీరును విద్యార్థులకు వివరించారు. ప్రధానంగా సీపీఆర్ ప్రక్రియా చేపట్టే తీరును కళ్లక కట్టినట్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీ మధు, పైలెట్ కోమురయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేట్రాక్ ప్రహరీ నిర్మాణ పనులు వేగవంతం

నవంబర్ మొదటి వారంలోగా ప్రహరీ నిర్మాణం పూర్తి

నల్లకుంట: గత నెలలో రైల్వే అధికారులు నల్లకుంట తిలక్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి విద్యానగర్ రైల్వే స్టేషన్ వరకు ట్రాక్‌కు ఇరువైపులు ఏపుగా పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టారు. ఈ క్రమంలో జేసీబీతో చెట్లు, పిచ్చి మొక్కల తొలగింపు సమయంలో కొన్ని చోట్ల రైల్వే ట్రాక్ ప్రహరీ దెబ్బతిన్నది. దీంతో గతనెలలో కురిసిన భారీ వర్షాలకు నల్లకుంట డివిజన్ పరిధిలోని నర్సింహబస్తీ నుంచి టీఆర్టీ కాలనీ షెటిల్‌కోర్టుకు వెళ్లే దారిలో ఇళ్లను ఆనుకుని ఉన్న రైల్వే ట్రాక్ ప్రహరీ గత నెల 27న వేకువ జామున కూలిపోయింది. ఆ సమయంలో విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో పాటు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత ఆ ప్రాంతాన్ని సందర్శించారు.



అదే సమయంలో రైల్వే అధికారులు కూడా అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకై ప్రహరీని స్టీల్, కాంక్రీట్, సిమెంట్‌తోనే నిర్మిస్తున్నారు. శుక్రవారం నాటికి ప్రహరీ బేస్‌మెంట్‌పై రెండున్నర ఫీట్ల మేర ఎత్తు నిర్మాణం పూర్తి చేయించారు. నవంబర్ మొదటి వారంలోగా ప్రహరీ నిర్మాణం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నటుడు జెన్నీకి 'నట కౌముది' పురస్కారం

చిక్కడపల్లి: సుప్రసిరి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో శుక్రవారం రాత్రి అక్కినేని నాగేశ్వర్‌రావు జయంతిని పురస్కరించుకొని అక్కినేని కథనాయికలు శీర్షికతో నిర్వహించిన సినీసంగీత విభావరి నిర్వహించారు. గాయనీ గాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న గీతాలను శ్రవణానందంగా ఆలపించారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు జెన్నీకి నటకౌముది పురస్కారాన్ని దూరదర్శన్ పూర్వ డైరెక్టర్ పాలకుర్తి మధుసూదన్‌రావు ముఖ్యఅతిథిగా ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, పండిట్ అంజిబాబు, ఎంకే నాయుడు, నిర్మలా ప్రభాకర్, జగన్నాథరావు, వీఏస్ఎస్ లావణ్య, శ్రీదేవి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలి

చిక్కడపల్లి: ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డిని కలసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు చిక్కడపల్లిలో మాట్లాడుతూ.. ఎస్సై, కానిస్టేబుల్ నియామకాలలో జీఓ నం.46ను రద్దు చేసి గ్రామీణ ప్రాంత యువతకు న్యాయం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రిజర్వేషన్లను పునరుద్ధరించాలన్నారు. జాబ్ కేలండర్‌ను విడుదల చేయాలని కోరారు. దీనికి చిన్నారెడ్డి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిరుద్యోగులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో నేతలు కుయ్య వెంకటేష్, శంకర్‌నాయక్, బాలకోటి, సంపత్, రాజేష్ పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థులకు మంచి అవకాశాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎంబీఏ విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా మంచి అవకాశాలు ఉన్నాయని ఓయు బిజినెస్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ డి. శ్రీరాములు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి. ఆర్. అంబేడ్కర్ ఎంబీఏ కళాశాలలో నూతన విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం జరిగింది. ప్రొఫెసర్ శ్రీరాములు మాట్లాడుతూ... విద్యా వ్యవస్థలో ఆధునికమైన మార్పులు వచ్చాయని అన్నారు.

చెట్ల కొమ్మలు తరలించండి

- రోడ్ల పక్కనే తొలగించిన చెట్ల కొమ్మలు
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు



శ్రీరామ కోఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ స్కూల్ పక్క లేన్‌లో ఓ పక్కన గృహనిర్మాణ సామగ్రి, మరో పక్క చెట్ల కొమ్మల వ్యర్థాల కుప్ప

నల్లకుంట: న్యూనల్లకుంటలో విద్యుత్ తీగలకు తాకుతూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు తొలగింపజేశారు. కాగా తొలగించిన కొమ్మలను వీధుల్లో ఎక్కడికక్కడ కుప్పలుగా వేసి వదిలేశారు. వీటిని అక్కడి నుంచి తరలించాల్సిన జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో రోజుల తరబడి వీధుల్లో పేరుకుపోతున్నాయి. చెట్ల కొమ్మలుగా ఉండటంతో దోమలు వృద్ధి చెంది కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. చెట్ల కొమ్మల కుప్పలను వీధుల్లోంచి తరలించాలని పలుమార్లు పారిశుద్ధ్య సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడంలేదని అంటున్నారు.

◆ శ్రీరామ కో-ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ పాఠశాల పక్కలేన్‌లోని కొందరు తమ ఇంటి ఆవరణలోని చెట్లు, పూల మొక్కల కొమ్మలను ట్రిమ్మింగ్ చేయించి, ఆ కొమ్మలను తీసుకువచ్చి బాధ్యతా రాహిత్యంగా వీధి పక్కనే పడవేశారు. దీనికి తోడు ఇళ్లలో పాచిపని చేసే కొందరు ఆయా ఇళ్ల నుంచి తీసుకు వస్తున్న వ్యర్థాలను ఈ చెట్ల కొమ్మల కుప్పలు ఉన్న చోటనే పడవేసి వెళుతున్నారని, దీంతో తీవ్రమైన దుర్వాసన వెలువడుతోందని వాపోతున్నారు. పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించి వీధుల్లో పేరుకుపోయిన చెట్ల కొమ్మల కుప్పలను ఇక్కడి నుంచి తరలించాలని కోరుతున్నారు.



వీధుల్లోనే గృహ నిర్మాణ సామగ్రి, వ్యర్థాల కుప్పలు..

◆ మరో పక్కన కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న కొందరు నిర్మాణ సామగ్రి, వ్యర్థాలను వీధుల్లోనే పోస్తున్నారు. ఒక పక్కన చెట్ల కొమ్మల కుప్పలు, మరో పక్కన గృహ నిర్మాణ సామగ్రి వ్యర్థాల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి వీధుల్లో గృహ నిర్మాణ సామగ్రి, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



బంద్‌తో ఢిల్లీకి సెగ తగలాలి

బీసీ జేఏసీ ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: ఈనెల 18న శనివారం జరిగే తెలంగాణ బంద్ సెగ ఢిల్లీకి తాకాలని బీసీ జేఏసీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు ఎస్. నిఖిల్ పటేల్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు, బీసీ నేతలతో కలిసి నారాయణగూడలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ బంద్‌లో ప్రతి బీసీ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో మద్దతు పలికాయని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉద్యమంలో స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చేలా రాజ్యాంగంలో సవరణ జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. బీసీలు తలపెట్టిన బంత్ రిజర్వేషన్ల సాధన కోసమే తప్ప ఎవరికీ వ్యతిరేకం కాదని చెప్పారు. బీసీల మాట వినకుండా కోర్టు స్టే ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఈ అంశాన్ని విడిచి పెట్టమని బీసీ రిజర్వేషన్లను సాధించి తీరుతామని స్పష్టం చేశారు. కాలేజీలు, పాఠశాలలు బంద్ పాటించాలని కోరారు. దుకాణాలు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు స్వచ్ఛందంగా మూసివేయాలని విజ్ఞప్తి చేశారు.

బీసీ బంద్‌కు ఆటో జేఏసీ మద్దతు

ముషీరాబాద్: బీసీ రిజర్వేషన్‌లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ బీసీ సంఘాల జేఏసీ 18వ తేదీన తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు అన్నివర్గాల ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బంద్‌ను జయప్రదం చేయాలని విద్యానగర్ నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని బస్ భవన్ వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు ఆటో జేఏసీ ప్రతినిధులు ఆర్.కృష్ణయ్యను కలిసి బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీసీ యువజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ నేతృత్వంలో ఈ ర్యాలీని ఏర్పాటు చేయగా ఆర్.కృష్ణయ్య ప్రారంభించారు. అనంతరం ఆటోలో ప్రయాణిస్తూ ఆర్.కృష్ణయ్య బస్ భవన్ వరకు వెళ్లారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌లను అడ్డుకోవడం అన్యాయమని అన్నారు. తమ వాదనలను కూడా వినకుండా హైకోర్టు స్టే విధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు రాజు, మణికంఠ, ఆటో యూనియన్ నాయకులు కృష్ణ, జహంగీర్, మల్లేష్, మహేష్, వెంకటేష్‌గౌడ్, రాజేష్, రాము తదితరులు పాల్గొన్నారు.



బంద్‌ను జయప్రదం చేయాలని నిర్వహించిన ఆటో ర్యాలీలో ఆర్.కృష్ణయ్య, ఆటో జేఏసీ నేతలు

'బీజేపీ, కాంగ్రెస్‌లు బీసీలతో ఆడుకుంటున్నాయి'

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్
- నేటి బంద్‌లో సబ్బండవర్గాలు పాల్గొనాలి



చిక్కడపల్లి: బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు 18న రాష్ట్ర బంద్‌కు సబ్బండవర్గాలు మద్దతు పలికి జయప్రదం చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ విజ్ఞప్తి చేశారు. జవహర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వ్యాపార, వాణిజ్య వర్గాలవారు, సినిమా థియేటర్‌లు, పెట్రోల్ బంక్‌లు, హోటళ్ల అందరూ మద్దతుగా తమ సంస్థలను మూసేసి బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలపాలన్నారు. రాష్ట్రంలో బీసీలకు జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు లభించాల్సిందేనని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో చిత్తశుద్ధి చూపడంలేదని ధ్వజమెత్తారు. అన్ని పక్షాలను కలుపుకుని ఢిల్లీకి తీసుకుపోతాని చెప్పి కాంగ్రెస్ నేతలు మాత్రమే ఢిల్లీకి వెళ్లి తూతూ మంత్రంగా జంతర్‌మంతర్‌లో ధర్నా చేశారన్నారు. ఒకసారి ఆర్డినెన్స్ అని... మరోసారి బీసీ బిల్లు అని... హైకోర్టు, సుప్రీంకోర్టు అంటూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీసీల జీవితాలతో ఆడుకుంటున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ముందుగానే అన్ని వ్యాపార, వాణిజ్యవర్గాలకు బంద్ పాటించాలని సూచనలు చేస్తున్నారని తెలిపారు. శనివారం ఉదయం తెలంగాణ భవన్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఖ్య నాయకులు బంద్‌ను పర్యవేక్షిస్తారని అన్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఉదయం 9గంటలకు ఆర్టీసీక్రాస్‌రోడ్ చేరుకుని బంద్‌ను పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముఠా జైసింహ, ముడారపు రాకేష్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ జహంగీర్‌కు అభినందన పత్రం

ముషీరాబాద్: ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పీస్ కమిటీ సభ్యుడిగా ఉంటూ వివిధ మతాలకు చెందిన పండుగ సమయాల్లో పోలీసులకు సహకరిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహ్మద్ జహంగీర్‌కు అప్రిషియేషన్ సర్టిఫికెట్‌ను సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి శుక్రవారం అందజేశారు. సెంట్రల్ జోన్ పరిధిలోని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పీస్ కమిటీ అధ్యక్షులు శశికాంత్ అగర్వాల్, ఆల్ జోన్స్ సెక్రటరీ శ్రీకృష్ణశర్మ, ఖదీర్, మహ్మద్ ఆలీ, తదితరులకు కూడా ఆమె అభినందించారు.

సంఘటిత ఉద్యమాలతోనే హక్కుల సాధన



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సంఘటిత ఉద్యమాలతోనే కార్మికుల హక్కులు సాధించబడతాయని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్మిక హక్కుల పోరాట సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ... శ్రామికుల శ్రమతోటే దేశంలో సంపద ఏర్పడుతుందని అలాంటి శ్రామికులను భూస్వాములు, పెట్టుబడిదారులు దోపిడీ చేస్తున్నారని అన్నారు. కార్మికుల శ్రమతో తయారవుతున్న సంపదపై వారికి హక్కు ఎందుకు ఉండదని ప్రశ్నించారు. శ్రామికుల హక్కుల గురించి యూనియన్లు చెప్పకుండా ఆర్థిక డిమాండ్లకే పరిమితమవుతున్నారని అన్నారు. తెలంగాణలో భూస్వాములు వ్యాపారస్తులు అవతారమెత్తి ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని అన్నారు. సామాజిక వేత్త సజయ మాట్లాడుతూ... అసంఘటిత రంగ శ్రామికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి వారికి లెబర్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సురుగు ప్రభాకర్, కార్యదర్శి కల్లెం చంద్రశేఖర ప్రసాద్, మోహన్ బైరాగి, వెంకటస్వామి, నాగయ్య, యాదగిరి, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంద్‌కు సహకరించండి

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట: రాష్ట్ర బంద్‌కు బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపుకు మద్దతూ తెలిపి అందులో పాల్గొంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు (శనివారం) అంబర్‌పేట సంపూర్ణ బంద్ జరిగేలా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. నియోజకవర్గం వ్యాప్తంగా ర్యాలీలు, ప్రదర్శనలు ఉంటాయని అన్నారు. స్వచ్ఛందంగా ఇప్పటికే ప్రజలు బంద్‌కు ముందుకు వచ్చారని ఆయన వెల్లడించారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన సూచించారు. అన్ని రంగాల వారు బంద్‌కు సహకరించాలని కోరారు.

బీసీ బంద్‌కు మద్దతు తెలిపిన నిరుద్యోగ జేఏసీ



లైబ్రరీలో మద్దతు ప్రకటిస్తున్న నిరుద్యోగులు

చిక్కడపల్లి: బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు ప్రజలు సంపూర్ణ మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ, బీసీ జేఏసీ పిలుపునిచ్చారు. చిక్కడపల్లి సిటీ సెంటర్ లైబ్రరీలో శుక్రవారం నిరుద్యోగులు పూర్తి మద్దతును ప్రకటించారు. రాజ్యాంగ సవరణ చేసి తొమ్మిదో షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టాలని కోరారు. విద్యార్థి జేఏసీ నాయకులు డి.సలీమ్, వెంకటేష్, నరేష్, సంపత్, రవి పాల్గొన్నారు.

హెచ్ఏఎల్ ఓబీసీ ఉద్యోగులు సైతం

కాచిగూడ: బీసీ రిజర్వేషన్లకు తెలంగాణ హైకోర్టు ఇచ్చిన స్టేకు నిరసనగా అక్టోబర్ 18న బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగులు పూర్తి మద్దతు ప్రకటించారు. హెచ్ఏఎల్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ ముదిరాజ్, కార్యదర్శి మధుసూదన్, చలం, సాయి కుమార్, గౌలీకర్, సత్యనారాయణ బంద్‌కు మద్దతు తెలియజేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

రిజర్వేషన్ల పోరాటంలో మేదరులు పాల్గొనాలి

ముషీరాబాద్: 42 శాతం బీసీ రిజర్వేషన్‌లపై హైకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బీసీ సంఘాలు తలపెట్టిన బంద్‌కు మహేంద్ర మేదర సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు జంటనగరాల మహేంద్ర సంఘం అధ్యక్షులు రేశం మల్లేష్ తెలిపారు. శుక్రవారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తమ హక్కుల కోసం సాగే ఈ పోరాటంలో మేదర కులస్తులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

తెలంగాణ బంద్‌కు సంఘీభావంగా ర్యాలీ



బంద్‌కు సంఘీభావంగా బీసీ నేతల ర్యాలీలో గుజ్జ సత్యం, రాజు నేత, చెరుకు మణికంఠ

కాచిగూడ: బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 18వ తేదీన శనివారం జరిగే తెలంగాణ రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని సంఘీభావంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం నేతృత్వంలో శుక్రవారం బీసీ నేతలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాచిగూడలో బీసీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు మణికంఠ, బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు నేత లతో కలిసి గుజ్జ సత్యం మాట్లాడుతూ... రాజకీయాలు, కులాలకు అతీతంగా బీసీలందరూ బంద్‌లో పాల్గొని రిజర్వేషన్ల హక్కును సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బంద్‌కు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు పూర్తి మద్దతు ఇచ్చినందున బంద్‌ను పూర్తి స్థాయిలో విజయవంతం చేసి బీసీల సంఘటిత శక్తిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించే విధంగా చేయాలన్నారు. బీసీ డిమాండ్లను సాధించుకునేంత వరకు ఈ ఉద్యమం ఇలాగే కొనసాగుతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను నిండా ముంచుతుందని... పెంచిన బీసీ రిజర్వేషన్లను తగ్గించడానికి అనేక మంది కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇందుకు కోర్టులను వేదికలుగా చేసుకుంటున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు పెంచడం ద్వారా రాష్ట్రంలో అన్ని కులాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు. అంతిమంగా రాజ్యాధికారంలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం వాటా దక్కుతుందని పేర్కొన్నారు.

రాష్ట్ర బంద్‌కు దండిగా కుల సంఘాల మద్దతు



ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో మాట్లాడుతున్న గంగం రవి

చిక్కడపల్లి: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టేకు నిరసనగా ఈనెల 18న బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర బంద్‌కు ముషీరాబాద్ మున్నూరుకాపు సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో వారు విలేకరుల సమావేశంలో సంఘం కన్వీనర్ గంగంరవి, అధ్యక్షుడు రెబ్బరామారావు, కుడిదిరాజులు మాట్లాడారు. ముషీరాబాద్ నియోజవర్గంలోని మున్నూరుకాపులు బంద్‌కు మద్దతు తెలిపి విజయవంతం చేసి బీసీల ఐక్యత చాటాలని విజ్ఞప్తి చేశారు. బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీసీ రిజర్వేషన్ బిల్లుకు పూర్తి మద్దతు ప్రకటించాలని వారు కోరారు.

పద్మశాలి ప్రజా సంఘం ముషీరాబాద్ ఆధ్వర్యంలో...

◆ బీసీ జేఏసీ చేపట్టిన తెలంగాణ రాష్ట్ర బంద్ పద్మశాలి ప్రజాసంఘం ముషీరాబాద్ అధ్యక్షుడు తలకొక్కుల సంజీవ్‌కుమార్, నేతలు రోషన్‌బాలు, పున్న సత్యారాయణలు బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం అశోక్‌నగర్‌లోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయమైన సామాజిక న్యాయం బీసీలకు అధికారం దక్కాలన్నారు. బీసీల హక్కయిన రిజర్వేషన్‌ను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు అమర్‌కుమార్, చింతకింది వంశీ పాల్గొన్నారు.

బంద్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి రావాల్సిందే..



విద్యానగర్‌లో బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న గుజ్జ సత్యం తదితరులు

ముషీరాబాద్: తెలంగాణలో సామాజిక న్యాయం కొరవడిందని నేటి బంద్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి రావాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. బంద్‌ను జయప్రదం చేయాలని శుక్రవారం విద్యానగర్, రాంనగర్, ముషీరాబాద్ తదితర ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించారు. బంద్‌ను జయప్రదం చేయాలని వ్యాపార వర్గాలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాది సాధించుకున్న తెలంగాణలో బీసీలకు రావాల్సిన వాటా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు బడ్జెట్, విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో అవకాశం లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 48 శాతం రిజర్వేషన్‌ల సాధారణ లక్ష్యంగా 18న తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.రాజ్‌కుమార్, మణికంఠ, అనురాధాగౌడ్, శ్రీధర్, హరీష్, నిఖిల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

- బీసీ రిజర్వేషన్ సాధన సమితి పిలుపు
- పార్లమెంట్‌లో చట్టం చేసే వరకు విశ్రమించం
- రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్
- 24న ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో బీసీల మహాధర్నా



చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో చిరంజీవులు, విశారధన్ మహారాజ్, బాలరాజ్‌గౌడ్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న బీసీలు తలపెట్టిన తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని 42శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి పిలుపునిచ్చింది. శుక్రవారం చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో బీసీ మేధావుల ఫోరం చైర్మన్ చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగొని బాలరాజ్‌గౌడ్, బీసీ ఎస్సీ, ఎస్టీ, జేఏసీ కన్వీనర్ డాక్టర్ విశారధన్ మహారాజ్, పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, స్టీరింగ్ కమిటీ సభ్యులు నారాయణగౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, బైరు శేఖర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్లను సాధించేందుకు స్వచ్ఛందంగా రాష్ట్ర బంద్‌లో పాల్గొని వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈనెల 24న చలో హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద బీసీల మహాధర్నాను చేపట్టనున్నట్టు తెలిపారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి పార్లమెంట్‌లో చట్టం చేసే వరకు విశ్రమించమని పేర్కొన్నారు.

శీతాకాల సమావేశాల్లో చట్టం చేయాలి...

◆ వచ్చే శీతాకాల సమావేశంలో పార్లమెంట్‌లో చట్టం చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. 60 శాతం ఉన్న బీసీలకు 29 శాతం రిజర్వేషన్ అమలు చేయడం సరైంది కాదన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని వారు హెచ్చరించారు. ఎర్రమాదు వెంకన్న నేత, గడ్డం మీది విజయ్ కుమార్ గౌడ్, ఒంటెద్దు నరేందర్, పోతగాని ఐలన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.